క్లుప్తంగా

క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దాలి



చేపల మార్కెట్ ఏరియాలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న సిబ్బంది, స్థానికులు

మణుగూరుటౌన్: స్వచ్ఛతా హీ సేవ 2.0 కార్యక్రమంలో భాగంగా మణుగూరు మున్సిపాలిటీని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దాలని కమిషనర్ ఉమామహేశ్వరరావు ఉద్యోగులకు సూచించారు. ఆదివారం పట్టణంలోని చాపల మార్కెట్ ఏరియాలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు చెత్త చెదారం తరలింపుతో పాటు ఆహారం వృథా కాకుండా, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ప్రజలు స్వచ్ఛందంగా తమ వీధుల్లో పరిశుభ్రత కార్యక్రమానికి ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని, చెత్తను కుండీలలో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన



చిన్నారికి వడ్డిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా

దమ్మపేట: మండల పరిధిలో పర్యటించిన స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం మండలంలోని తాటిసుబ్బన్నగూడెంలోని నివాసంలో, క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. నాయుడుపేట, దురదపాడు గ్రామాల్లో గణేష్ మండపాలను సందర్శించి, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే స్వయంగా వడ్డన చేశారు. పర్యటనలో గ్రామస్తులను ఆత్మీయంగా పలకరించి, వారి బాగోగులు తెలుసుకున్నారు. మండలపల్లి గ్రామంలో ప్రైవేట్ ఆన్‌లైన్ సెంటర్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు దారా యుగంధర్, మన్నెం అప్పారావు, కాసాని నాగప్రసాద్, అబ్దుల్ జిన్నా, చిట్టిబాబు, ఎర్ర వసంతరావు, స్థానిక సర్పంచ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చర్లరూరల్: చర్ల మండలం మేడువాయి గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని శృతికి కడుపులో గడ్డలు కాగా.. శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉంది. కూలి పనులు చేసుకునే తల్లిదండ్రులు ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా శెట్టిపల్లి శ్రీనివాస్ రూ.5వేల సాయం అందించారు. దినసరపు సంజీవరెడ్డి, అక్కిన రమేష్ చేతుల మీదుగా ఆ నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. దాతలు ముందుకొచ్చి మరింత సాయం అందించాల్సిందిగా ఆ కుటుంబం కోరుతోంది. కార్యక్రమంలో పూసం ముత్యాలరావు, మడకం రాము, కంచర్ల పెద వెంకటేశ్వర్లు, గద్దల బాబు, కొప్పుల చిలకమ్మ, చెన్నం సమ్మక్క, సూదుల నరసయ్య తదితరులు ఉన్నారు.

అమరుల ఆశయాలను కొనసాగించాలి

బూర్గంపాడు: పీడిత ప్రజల విముక్తి కోసం విప్లవోద్యమాలు చేసిన అమరుల ఆశయాలను కొనసాగించాలని పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు పెదగొని ఆదిలక్ష్మి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కృష్ణసాగర్ గ్రామపంచాయతీలోని చింత లక్ష్మీనగర్‌లో ఆదివారం ముక్తార్ పాషా, పైలా చంద్రక్కల వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముక్తార్‌పాషా, చంద్రమ్మలు ఎన్నో కష్టాలు ఎదుర్కొని ప్రజల కోసం జీవితాలను త్యాగం చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు నాగేశ్వరరావు,ఎల్ రవి, భూలక్ష్మి, ధనలక్ష్మి, సుజాత, రాధా, సంధ్యా, వెంకన్న, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ

దమ్మపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించిన కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు జారే ఆదినారాయణ పలువురిని పరామర్శించారు. ఆదివారం దమ్మపేట గ్రామంలో ఇటీవలే ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న దారా ధర్మేంద్రను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మొద్దులగూడెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న బేతి శ్రీనును పరామర్శించారు. అనంతరం పలు గ్రామాల్లో గణేష్ మండపాలు, చర్చిలను సందర్శించి, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని, భక్తులకు వడ్డన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, కక్కిరాల రమేష్, చామర్తి గోపిశాస్త్రి, సాయిల నర్సీ, ఏసుమణి, చక్రాల మల్లేశ్వరరావు, జెట్టి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యానికి పరేషాన్

- పశువుల ఆస్పత్రుల్లో మందుల కొరత
- అరకొర బడ్జెట్ కేటాయింపులే కారణం
- ప్రైవేటుగా కొనుక్కుంటున్న రైతులు



పశువులకు వైద్యం చేస్తున్న సిబ్బంది

బూర్గంపాడు: భద్రాచలం డివిజన్‌లో పశువైద్యానికి ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందుల కొరతతో పశువైద్యానికి ప్రతిబంధకంగా మారింది. ఈ పరిస్థితులు పశువుల పెంపకందారులపై ఆర్థికభారం మోపుతున్నాయి. భద్రాచలం డివిజన్‌లోని ప్రభుత్వ పశువుల ఆస్పత్రులలో పశువైద్యానికి అవసరమైన మందులు పూర్తిస్థాయిలో లేకపోవటంతో వైద్యసేవలు అరకొరగానే అందుతున్నాయి. రైతులు మందులను ప్రైవేటుగా కొనుగోలు చేసి తీసుకువస్తేనే పశువైద్యులు వైద్యం చేసే పరిస్థితులున్నాయి. దీంతో పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పశువైద్యానికి అవసరమైన మందుల కొనుగోలుకు అరకొరగా బడ్జెట్ విడుదల చేయటంతో ఈ పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ప్రతి ఏటా నాలుగు విడతలుగా మూడునెలలకు ఒకసారి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. ప్రతి ఏటా ఏప్రిల్ నుంచి మార్చి వరకు ఫైనాన్షియల్ ఈయర్‌గా గుర్తించి మూడునెలలకు ఒకసారి నిధులు విడుదల చేస్తారు. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు తొలి క్వార్టర్ బడ్జెట్ కూడా ఇప్పటి వరకు విడుదల కాలేదు. దీంతో పశువుల ఆస్పత్రులలో మందులకు గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రతిఏటా తొలకరిలో జూలై, ఆగస్టు నెలల్లో జీవాలకు (గొర్రెలు, మేకలకు) నట్టల మందులు వేస్తారు. అయితే ఈ ఏడాది నట్టల మందుల పంపిణీ కూడా జరగలేదు.

భద్రాచలం డివిజన్‌లో 1.39 లక్షల ఆవులు,1.08లక్షల గేదెలు, 1.3 లక్షల గొర్రెలు, 1.22లక్షల మేకలు, 3వేల పందులు, 12వేల పెంపుడు కుక్కలున్నాయి. 42కు పైగా ప్రభుత్వ పశువైద్యశాలలున్నాయి. అయితే పశువులకు ఏ రోగమొచ్చిన ఆస్పత్రుల్లో మందులు లేవు. ఈ ఏడాది మూడునెలలుగా వర్షాలు విపరీతంగా పడుతున్నాయి. దీంతో పశువులకు, జీవాలకు జ్వరాలు, గొంతువాపు, పొదుగువాపు, పారుడు, బొబ్బరోగం, చిటుకు రోగం తదితర జబ్బులు వస్తున్నాయి. పశువులను, జీవాలను ప్రభుత్వ పశువైద్యశాలలకు తోలుకెళితే అక్కడ మందులు ఉండటం లేదు. అక్కడ వైద్యులు రాసిన మందులు రైతులు ప్రైవేటుగా కొనుక్కుని వస్తేనే వైద్యం అందే పరిస్థితులున్నాయి. ప్రైవేటుగా మందులు కొని పశువులకు వైద్యం చేయించటం రైతులకు ఇబ్బందికరంగా మారింది. పంటలకు పెట్టుబడులకే నానా ఇబ్బందులు పడుతున్న రైతులు పశువైద్యానికి కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితులున్నాయి. కొందరు రైతులు పశువులకు సరైన వైద్యం అందించలేక సంతలలో పశువులను తెగనమ్ముకుంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో మందులు లేకపోవటం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పశువైద్యశాలలకు మందుల కొనుగోళ్లకు ప్రభుత్వం నాలుగు విడతలుగా నిధులు విడుదల చేస్తోంది. వైద్యాధికారులు ఆస్పత్రులలో అవసరమైన మందులను ప్రతిపాదించి ప్రభుత్వానికి పంపుతారు. జిల్లాకు కేటాయించిన బడ్జెట్ ఆధారంగా మందులను కొనుగోలు చేస్తారు. అయితే ప్రభుత్వం నాలుగు విడతలుగా ఇచ్చే నిధులను సకాలంలో ఇవ్వటం లేదు. ఈ ఏడాది ఇప్పటి వరకు రెండు విడతల గ్రాంటు విడుదల చేయాలి. అయితే ఇప్పటి వరకు తొలి విడత గ్రాంటు కూడా విడుదల కాలేదు. ఇప్పుడు పశువుల ఆస్పత్రుల్లో మందులు కొరత వేధిస్తోంది. పశువులకు ఏ రోగమొచ్చిన వైద్యులు చీటి రాసి మందుల కోసం బయటకు పంపుతున్నారు. జిల్లావ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా పశువైద్యంపై దృష్టి పెట్టి ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మందులు ఉండటం లేదు

పశువుల ఆస్పత్రికి వెళితే అక్కడ మందులుండటం లేదు. మందులు రాసిస్తా, ఇంజక్షన్లు రాసిస్తా తెచ్చుకోండని వైద్యులు చెబుతున్నారు. బయట మందులు కొనాలంటే వందల రూపాయలు ఖర్చవుతున్నాయి. పెద్ద మందులు లేకపోయిన కనీసం నొప్పులు, జ్వరం మందులు కూడా లేకపోవటం దారుణం.

– బూరం పద్మ, బూర్గంపాడు

చీటీ రాసి పంపుడే..

పశువులకు ఏదైనా రోగం వచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి పోతే వెంటనే చీటి రాసి మందులు తెచ్చుకోమంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మందుల లేకపోతే చిన్నరైతులు పశువులకు డబ్బులు పెట్టి ఏమీ వైద్యం చేయించుకుంటారు. దూడలకు పారుడు మందు పెట్టామన్న లేదంటున్నారు. ఇలాంటి పరిస్థితి ఇంతకు ముందులేదు.

– భూక్యా రాములు, నాగినేనిప్రోలు

కొన్ని మందులే లేవు..

పశువుల ఆస్పత్రుల్లో కొన్ని మందులు మాత్రమే అందుబాటులో లేవు. మిగతావి ఆస్పత్రిలో ఉన్నాయి. పశువులకు సాధ్యమైనంత వరకు ఆస్పత్రుల్లోని మందులతోనే వైద్యం చేస్తున్నాం. తప్పనిసరి పరిస్థితుల్లోనే మందులకు బయటకు పంపిస్తున్నాం. బడ్జెట్ వచ్చిన వెంటనే పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉంటాయి.

– డాక్టర్ రవీందర్, పశువైద్యాధికారి

ముమ్మరంగా తనిఖీలు



దుమ్ముగూడెం: వాహన తనిఖీలు చేస్తున్న సీఐ దోమల రమేష్, సిబ్బంది

దుమ్ముగూడెం: సీపీఐ (మావోయిస్టు) ఆవిర్భవించి 19 ఏళ్లు పూర్తవుతుండగా ఆ పార్టీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సీఐ దోమల రమేష్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు కేశవరావు, గణేష్‌లు ముమ్మరంగా వాహన తనిఖీలు గాలింపు చర్యలను చేపడుతున్నారు. మండలంలోని మావోయిస్టు ప్రభావిత గ్రామాలైన మానుగట్టు, ములకనాపల్లి, పైదిగూడెం, గద్దమడుగు, చింతగుప్పలతో పాటు సరిహద్దు గ్రామాల్లో ప్రత్యేక బలగాలతో నిత్యం గాలింపు చర్యలు చేపడుతున్నారు. మావోయిస్టు వారోత్సవాల సమయంలో పోలీసుల బూట్ల చప్పుల్లతో మారుమూల గ్రామాల్లోని ప్రజలు భయందోళనలు చెందుతున్నారు. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలైన అటవీ గ్రామాలు ప్రజలు ఇళ్లలోంచి బయటకు వెళ్లేందుకు ఉలిక్కిపడుతున్నారు. తమ గ్రామాల వైపు వచ్చేది పోలీసుల లేక? మావోయిస్టులా? అని భయపడుతున్నారు. ఎప్పుడు ఏ వార్త వినాల్సివస్తుందో అనే భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. కాగా, వారోత్సవాల ప్రారంభం రోజున మండలంలో మావోయిస్టు పార్టీకి వ్యతిరేకంగా కరపత్రాలు వెలిశాయి.

చర్ల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, దంతెవాడ, సుకుమా జిల్లాల్లోని అటవీ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, కొరియర్లు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, లక్ష్మీకాలనీ, పెట్రోల్‌బంక్ సెంటర్, గాంధీ సెంటర్లతో పాటు కలివేరు క్రాస్‌రోడ్, ఆర్ కొత్తగూడెం తదితర గ్రామాల్లో మోహరించిన సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు వచ్చి పోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంలో అనుమానితులుగా భావిస్తూ పలువురు ఆదివాసీలను అదుపులోకి తీసుకొని విచారించి విడిచిపెట్టారు. సీఐ బి.రాజగోపాల్ నేతృత్వంలో ఈ తనిఖీలు కొనసాగాయి.

లోగుట్టు బయటపడేనా?

ములకలపల్లి: ములకలపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ ధృవీకరణ లేకుండానే ఓ యువతికి ఎస్టీ కుల సర్టిఫికెట్ మంజూరీపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఉదంతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగి 'డిజిటల్ కీ'ఉపయోగించి, ధృవపత్రం ఇచ్చినట్లు అంగీకరించాడని తెలుస్తోంది. దీంతో సదరు ఉద్యోగిని తాత్కాలికంగా తొలగించినట్లు సమాచారం. అయితే 'డిజిటల్ కీ'వినియోగించి ఇప్పటికీ అక్రమంగా ఎన్ని సర్టిఫికెట్లు బయటకు వచ్చాయనేది ప్రధాన ప్రశ్నగా మారింది. ఈ ఉదంతంపై 'డిజిటల్ కీ'దుర్వినియోగం శీర్షికన సాక్షి పత్రికలో కథనం వెలుపడిన నేపథ్యంలో ఇంటిలిజెన్స్ అధికారులు, క్షేత్రస్థాయిలో పర్యటించి, సమగ్ర వివరాలు సేకరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇన్ని ఆరోపణలు వెల్లువెత్తుతున్నా, రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంపట్ల మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. రెవెన్యూ అధికారులు గత తహసీల్దార్ హయాంలో ధ్రువపత్రం జారీ అయిందని చెబుతూ చేతులు దులుపుకునే యత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపడితే దొడ్డిదారిన మంజూరైన సర్టిఫికెట్ల వివరాలు వెలుగులోకి వస్తాయనే వాదనలు వినవస్తున్నారు.

చిన్నచేపలే బలయ్యాయా..?

ఈ అంశంలో కిందిస్థాయి ఉద్యోగులే బలయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డిజిటల్‌కీ దుర్వినియోగంపై కంప్యూటర్ ఆపరేటర్‌పై రెవెన్యూ అధికారులు వేటు వేశారు. ఇతనిని తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు తెలుస్తోంది. కానీ సర్టిఫికెట్ జారీ డిపార్ట్‌మెంట్‌లోని తహసీల్దార్ వంటి పై అధికారులకు తెలియకుండానే జరిగిందా? వారి ప్రమేయం కూడా ఉంటే పై అధికారులపై చర్యలేవి అనేవి స్థానికులు సంధిస్తున్న ప్రశ్నలు. కాగా ఆర్ఐపై వాదనకు దిగిన విషయమై యువతి భర్త, బ్యాంకు ఉద్యోగిని పాల్వంచ బ్రాంచ్‌కు బదిలి చేసినట్లు తెలిసింది.

ఎమ్మెల్యే ఆరా?

ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆరా తీసినట్లు సమాచారం. ఫారం-కే (ఏజెన్సీ ప్రాంతంలో భూములను గిరిజనులే కొనాలనే నిబంధన) ఉదంతంలో విచారణ చేపట్టగా ఈవిషయం బయటకు పొక్కింది. ఐతే విచారణ పేరిట ఆర్ఐ యువతితో అసభ్యకరంగా మాట్లాడారని ఆరోపిస్తూ యువతి బంధువులతోపాటు, ములకలపల్లికి చెందిన ఓ బ్యాంకు మేనేజర్, ఉద్యోగి తహసీల్దార్ కార్యాలయంలో వాదనకు దిగారు. దీంతో మనస్థాపానికిగురైన ఆర్ఐ స్థానిక పోలీస్‌స్టేషల్లో ఫిర్యాదు చేశారు. ఐతే సదరు యువతివైపు నుంచి కూడా ఆర్ఐపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈతరుణంలో సదురు బ్యాంకు మేనేజన్, సహఉద్యోగి ఇటీవల ఎమ్మెల్యేను కలిసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈక్రమంలో అధికార పార్టీకిచెందిన మండల నాయకులు, ఓ ప్రజాప్రతినిధి రెవెన్యూ అధికారులతో రాజీయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

క్రీడా పోటీలకు తరలింపు



జిల్లా స్థాయి క్రీడా పోటీలకు తరలివెళ్తున్న విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: జిల్లా స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు ఆదివారం అశ్వారావుపేటలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులు తరలి వెళ్లారు. ఖమ్మం జిల్లా కారేపల్లిలో ఈ నెల 25, 26, 27వ తేదీల్లో మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడా పోటీలకు స్థానిక పాఠశాలకు చెందిన మొత్తం 73 మంది విద్యార్థులు ఎంపిక కాగా, వీరిని కళాశాల ప్రిన్సిపాల్ టి.సంగీత ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులో తరలించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచేలా ప్రత్యేకంగా శిక్షణ అందించామని, చదువుతోపాటు క్రీడా రంగానికి కూడా తగిన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీ ప్రమీల, బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

భద్రాచలంటౌన్: ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేయడం ద్వారా ఉద్యమాన్ని ఆపలేరని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కెచ్చల రంగారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోడు భూములకు పట్టాలు, ఆదివాసీల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్న ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి కొండా చరణ్‌ను అరెస్టు చేయడాన్ని అక్రమంగా పరిగణిస్తూ.. ఆయన తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొండా చరణ్ అరెస్ట్ అక్రమమని, దానినితీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గొత్తికోయలకు పోడు పట్టాలు ఇవ్వాలని ఈ నెల 25న భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని ప్రచారం చేస్తున్న చరణ్‌ను అక్కడి పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని, ఇలాంటి చర్యలను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్రమ అరెస్టులను ప్రజాస్వామ్య వాదులు, ప్రజానీకం ఖండించాలని, అరెస్టు చేసిన చరణ్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

దుమ్ముగూడెం: సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొండా చరణ్‌ను చర్ల పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆదివారం ఆ పార్టీ నాయకుడు దాసరి సాయన్న ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

దమ్మపేట: సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొండా చరణ్ అరెస్ట్ అక్రమం అని ప్రజాపంథా జిల్లా నాయకులు అమర్లపూడి రాము ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గొత్తికోయల సమస్యలపై సోమవారం భద్రాచలంలో నిర్వహించనున్న ప్రదర్శన కార్యక్రమాన్ని, కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్న కొండా చరణ్‌ను, చర్ల పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ములకలపల్లి: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొండా చరణ్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రజాపంథా జిల్లా కార్యవర్గ సభ్యుడు నూపా భాస్కర్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయనను బేషరతుగా విడుదల చేయాలన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో జిల్లా కమిటీ సభ్యుడు కల్లూరి కిషోర్, పోతుగంటి లక్ష్మణ్, పార్టీ మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ, డివిజన్ నాయకురాలు కల్లూరి పద్మ, ఎంపీటీసీలు నూపా సరోజిని, మడకం విజయ తదితరులున్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యం



ప్రచార కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది శూన్యమని, కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా గడప గడపకూ పాదయాత్ర నిర్వహించి కాంగ్రెస్ పార్టీ పథకాలు వివరిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం 12వ రోజు మున్సిపాలిటీ పరిధిలోని రాయిగూడెం కాలనీ, చిన్నరాయిగూడెం, కమలాపురం గ్రామాల్లో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేయబోయే పథకాలను, వరంగల్ రైతు డిక్లరేషన్, చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, ఆరు గ్యారెంటీ కార్డులను వివరించి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కేవీరావు, ఉపసర్పంచ్‌లు పుచ్చకాయల శంకర్, వీరంకి వెంకట్రావ్ గౌడ్, తరుణ్‌రెడ్డి, తాటి భిక్షం, నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, కుర్రం రవి, మాదాడి రాజేశ్, పాతూరి వెంకన్న, మానస, సురేశ్, నగేశ్, మహేశ్ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్‌ల నియామకం

భద్రాచలంటౌన్: భద్రాచలం మండలంలోని 41 పోలింగ్ బూత్‌లకు కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఇన్‌చార్జ్‌లను నియమించింది. భద్రాచలం ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య ఆదేశాల మేరకు ఎల్‌డీఎం కోఆర్డినేటర్ నల్లపు దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు సరెళ్ల నరేష్‌లు 9 మందితో కమిటీల ఇన్‌చార్జ్‌లను ప్రకటించారు.

జన్మదిన వేడుకలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డు సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఏరియా ఆస్పత్రి పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కేక్‌కట్ చేసి చిన్నారులకు పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గీత, బిర్రు సుధాకర్, సరిత, సాకేత్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'స్థలాన్ని ఆక్రమించారు..'

మణుగూరురూరల్: భద్రాచలానికి చెందిన ఆదివాసీ న్యాయవాది పర్శిక సోము స్థలాన్ని కొంతమంది ఆక్రమించారని, అది దారుణమని కూనవరం పంచాయతీ సర్పంచ్ ఏనిక ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొంతమంది రాజకీయ పార్టీల నాయకుల ప్రోద్బలంతోనే ఆదివాసీ సంక్షేమ పరిషత్‌కు చెందిన పాండ్రు హేమసుందర్, నూపా నాగేశ్వరరావులు వారి అనుచరులతో కలిసి ఆదివాసీ న్యాయవాది సోము భూమిని ఆక్రమించారని ఆరోపించారు. ఈ ఆక్రమణను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విజయవంతం చేయాలి

దుమ్ముగూడెం: ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో జీఓ. నం.3కి చట్టబద్ధత కల్పించాలంటూ ఈ నెల 28వ తేదీన తలపెట్టిన బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఏఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పలు గ్రామాలలో పర్యటించారు. మాట్లాడారు. ఏఎస్పీ మండల అధ్యక్షుడు కుర్సం రవి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూప సీతయ్య, నూప చిట్టిబాబు పాల్గొన్నారు.

నిరుద్యోగులతో చెలగాటం

అశ్వాపురం: నిరుద్యోగులతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని తెలంగాణ జన సమితి పార్టీ మండల అధ్యక్షుడు సురకంటి ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని మొండికుంటలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం ఏర్పాటు అయ్యాక 2 లక్షల ఉద్యోగాలు భర్తీ అవుతాయని సీఎం కేసీఆర్ పలుమార్లు చెప్పారని, కానీ ఉద్యోగాల కల్పనలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే వరకు నెల నెలా రూ.5 వేలు నిరుద్యోగ భృతి చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

మద్దతు ధర చట్టం చేయాలి

దమ్మపేట: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర పలికేలా కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలని కిసాన్ మోర్చా జిల్లా నాయకుడు అమర్లపూడి రాము డిమాండ్ చేశారు.

ఆదివారం మండల కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా మండల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా నాయకులు అమర్లపూడి రాము మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా, కనీస మద్దతు ధర చట్టం చేయాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధర చట్టం చేస్తామని హామీ ఇచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. హామీని విస్మరించారని అన్నారు. మద్దతు ధర చట్టం చేయని పక్షంలో రైతాంగ పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ భాస్కరరావు, మోరంపూడి శ్రీనివాసరావు, దస్తగిరి, ప్రసాద్, అర్జున్, రాము తదితరులు పాల్గొన్నారు.

గణేశ‌ల ఊరేగింపు



మణుగూరుటౌన్: వినాయకుడి ఊరేగింపులో నృత్యం చేస్తున్న యువత

మణుగూరుటౌన్: గణేశ్ విగ్రహాలను ఆదివారం మధ్యాహ్నం నుంచే ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. శ్రీశ్రీనగర్, వినాయకనగర్, చేపలమార్కెట్ ఏరియాల విగ్రహాలను, కోల్ ట్రాన్స్‌పోర్ట్ ఆధ్వర్యంలో గణనాథుడిని ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ట్రాక్టర్లపై, లారీలపై ఉంచి పాటలతో నృత్యాలు చేస్తూ తరలించారు. చిన్నా పెద్ద తేడా లేకుండా కేరింతలు కొడుతూ.. పట్టణంలో ఊరేగించారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని కొత్త మామిళ్లవారిగూడెం, తిరుమలకుంట, నందిపాడు, అశ్వారావుపేటలోని పలు ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాలను ఆదివారం ఘనంగా ఊరేగించి నిమజ్జనానికి తరలించారు. ట్రాక్టర్లలో పుర వీధుల గుండా తీన్మార్ డప్పులు, నృత్యాలతో తీసుకెళ్లారు. అనంతరం ఆయా గ్రామాల సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు.

ఘనంగా పూజలు..

చండ్రుగొండ: మండలంలోని పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాల వద్ద ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండ్రుగొండ, రావికంపాడు, పోకలగూడెం గ్రామాల్లో గణనాథుడి సన్నిధిలో కుంకుమపూజలు జరిపించారు. రావికంపాడులో జరిగిన కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మెన్ భూపతి ధనలక్ష్మి, సర్పంచ్ రణ్యా, భూపతి శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని నెహ్రూ మార్కెట్ సెంటర్‌లోని ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద చిన్నారులు తయారు చేసిన చంద్రయాన్-3 రాకెట్‌లోని వినాయకుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిచారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సరస్వతి పూజా కార్యక్రమం నిర్వహించగా.. పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కంభంపాటి సురేష్, సంజయ్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

మండపం వద్ద అన్నదానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని ఉద్యోగులు నివాస సముదాయంలో భక్త మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీడీ మణెమ్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అందరూ భక్తి భావంతో కలిసిమెలసి ఉండే విధంగా కుల, మతాలకు తావులేకుండా ఈ పండుగను జరుపుకుంటామని అన్నారు. కార్యక్రమంలో అధికారులు తానాజీ, విజయ్‌కుమార్, సురేష్‌బాబు, హరికృష్ణ, రామ్‌కుమార్, ప్రమీలబాయ్ పాల్గొన్నారు.